జిల్లాలో 1.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : ఏసీ

నేరేడుచర్ల, డిసెంబర్ 19: జిల్లాలో మొత్తం 310 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 1.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అదనపు కలెక్టర్ పర్సు రాంబాబు తెలిపారు. గురువారం నేరేడుచర్ల తాసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1.07 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 75 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మొత్తం కొనుగోలు చేసిన ధాన్యానికి రూ. 421 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ. 352 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, మిగతా మొత్తాన్ని మరో రెండు రోజుల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో గతేడాది సీఎంఆర్ ధాన్యం బకాయిలు ఉన్న 65 రైస్ మిల్లులకు ఈసారి ధాన్యం ఇవ్వకుండా నిలిపివేశామని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా పకడ్బందీగా కట్టడి చేసినట్లు వెల్లడించారు. అంతకుముందు మున్సిపాలిటీలోని పలు వెంచర్లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో తాసీల్దార్ సురిగి సైదులు, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, డీపీఓ అంజయ్య పాల్గొన్నారు.

సూర్యాపేట మున్సిపాలిటీకి చేంజ్ మేకర్స్ అవార్డు

చేంజ్ మేకర్స్ అవార్డు అందుకుంటున్న ఇంజినీర్ శివప్రసాద్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 19: సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ), ఎంఓహెచ్‌యూఏ సంయుక్తంగా అందజేసే చేంజ్ మేకర్స్ అవార్డును సూర్యాపేట మున్సిపాలిటీ దక్కించుకోగా, గురువారం ఢిల్లీలోని సిల్వర్ హోక్ హాల్‌లో సీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ సునీత నరైన్ చేతుల మీదుగా సూర్యాపేట మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శివప్రసాద్ అందుకున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ప్రదర్శన, ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్, బ్రిక్స్, మ్యాట్‌లు, ఇతర వస్తువులు తయారు చేయడంతో పాటు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభను కనబర్చినందుకు ఈ అవార్డు దక్కింది. అవార్డు రావడంపై సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ బి.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

మంత్రుల ఫేస్ మాస్క్‌తో ఉన్నవారికి వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సూర్యాపేట, డిసెంబర్ 19: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట గత పది రోజులుగా దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు గురువారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కాగా, నిరసనలో భాగంగా మంత్రుల ఫేస్ మాస్క్ ధరించిన వారికి సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సంఘీభావం తెలిపిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగేళ్ల జితేందర్‌రెడ్డి, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, బండి రవి, పుల్లూరి సింహాద్రి, ఓయూ ప్రొఫెసర్ వెంకటరాజయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాస్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'సీసీ కెమెరాలు పనిచేయడం లేదనేది అవాస్తవం'

నాగారం, డిసెంబర్ 19: నాగారం బంగ్లాలో సీసీ కెమెరాలు పని చేయడం లేదనేది అవాస్తవమని నాగారం ఎస్ఐ ఐలయ్య అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నాగారం బంగ్లాలో దొంగతనం జరిగిన సమయంలో ఓ పత్రికలో సీసీ కెమెరాలు పని చేయడం లేదని వచ్చిందని తెలిపారు. గత వారం రోజుల సీసీ ఫుటేజీని పరిశీలించి సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా లేదా అని నిర్ధారించుకోవచ్చని సూచించారు. పత్రికల్లో వార్తలు రాసే ముందు పూర్తి సమాచారం తెలుసుకొని రాయాలన్నారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, రైటర్ శేఖర్, కానిస్టేబుళ్లు నారాయణరెడ్డి, కమల్ తదితరులు పాల్గొన్నారు.

'కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

పాలకవీడు, డిసెంబర్ 19: ప్రభుత్వం కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు పెరుమాళ్ల సతీశ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గురుకులాల ఉపాధ్యాయులకు దీటుగా కేజీబీవీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నప్పటికీ వారి వేతనాల్లో ఎంతో వ్యత్యాసం ఉందని అన్నారు. వారికి కూడా సరైన వేతనాలు ఇవ్వాలని అన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

కోదాడ టౌన్, డిసెంబర్ 19: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాక్టో, ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. కోదాడలోని సీసీ రెడ్డి పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఆయన ఉపాధ్యాయులతో కలిసి సందర్శించి మాట్లాడారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాక్టో నాయకులు ఓరుగంటి నాగేశ్వరరావు, బందం వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌నాయుడు, రూప్లానాయక్, బీఆర్‌సీ రెడ్డి, భూపతి శ్రీనివాస్, నాగయ్య, యలగొండ శ్రీనివాస్, కిరీటం ఆదినారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

గరిడేపల్లి, డిసెంబర్ 19: ఉపాధి హామీ పథకంపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉపాధి కార్డు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదని గ్రామాల్లో తనిఖీ చేసిన బృందాలు ఉన్నతాధికారులకు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు పథకాన్ని పట్టించుకోవడం లేదని వెల్లడించారు. ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి సంతకాలు లేకుండానే పేమెంట్లు చేశారని, పోస్టర్ డిపార్ట్‌మెంట్ బీపీఓలు పేమెంట్లు చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.డిప్యూటీ సీఈఓ శిరీష, మండల ప్రత్యేకాధికారి శ్యాంప్రసాద్, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ హరిసింగ్, ఏపీఓ లింగారెడ్డి, క్యూసీ డీఈ శ్రీనివాస్, అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ ఆశరాణి, ఏపీఓ సురేశ్, ఈసీ సుజాత పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశోధనలకు నాంది పలకాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

కోదాడ టౌన్, డిసెంబర్ 19: వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశోధనలకు నాంది పలకాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కోదాడలోని సీసీ రెడ్డి పాఠశాలలో నిర్వహిస్తున్న 52వ జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సైన్స్ లేకపోతే జీవితమే లేదని, విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభిరుచిని పెంచుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన దోహదపడుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా 23 మండలాల నుంచి 312 ప్రదర్శనలు వచ్చాయని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం కూడా కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీలారమేశ్, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజ్, రామచంద్రరావు, ఎంఈఓలు సలీంషరీఫ్, చక్రునాయక్, కౌన్సిలర్ గంధం యాదగిరి పాల్గొన్నారు.

బాలల అభివృద్ధికి అనేక చట్టాలు

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సూర్యాపేట లీగల్, డిసెంబర్ 19: బాలల అభివృద్ధి కోసం అనేక చట్టాలు ఉన్నాయని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ లిటరసీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలబాలికలు చట్టాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి డి.మల్లయ్య, వి.సత్యనారాయణ పిళ్లై, పి.వాణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్ల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తుంగతుర్తి, డిసెంబర్ 19: మండల కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట పలువురు అంగన్‌వాడీ టీచర్లు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బండరామారం, మంచ్యతండా, సూర్యతండా, జేత్యాతండా, రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు మాట్లాడుతూ.. తాము నవంబర్‌లో ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేలో పాల్గొని నిబద్ధతతో విధులు నిర్వహించామని, అయితే, సూపర్‌వైజర్ ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తూ తాము ఎలాంటి సెలవులు పెట్టకున్నా జీతాల్లో కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీతాలు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆకారపు వాణి, ఆకారపు పూలమ్మ, లకావత్ కాంతమ్మ, భారతి, భారతమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

కాగా, మండలంలోని రావులపల్లి అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసినా నవంబర్ నెలలో హాజరై జీతం చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

జీతాల్లో కోత వాస్తవమే : సీడీపీఓ శ్రీజ

అంగన్‌వాడీ టీచర్ల జీతాల్లో కోతలపై సీడీపీఓ శ్రీజను వివరణ అడగగా వాస్తవమేనని తెలిపారు. వారి జీతాలను చేసేది సూపర్‌వైజర్ అని, ఎక్కడ తప్పు జరిగిందో విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఐక్యతా దినోత్సవం

రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కోదాడ టౌన్, డిసెంబర్ 19: హిందూ, ముస్లిం ఐక్యతా దినోత్సవాన్ని కోదాడలోని రాజీవ్ చౌక్‌లో సోషల్ యాక్టివిస్ట్ ఫోరం కన్వీనర్ షేక్ మునీర్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1927 డిసెంబర్ 19న ఆంగ్లేయులు ఉరితీసిన స్వాతంత్ర్య సమరయోధులు పండిత రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మత ధర్మాలు వేర్వేరు అయినప్పటికీ స్వాతంత్ర్య పోరాటంలో వారి పాత్ర చిరస్మరణీయమన్నారు. శ్రీనివాస్‌గౌడ్, ఏపూరి రాజు, బాజన్, రాయపూడి వెంకటనారాయణ, శోభన్, ఖాజామియా, షఫీ, రఫీ పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీ నియామకం

మేళ్లచెర్వు, డిసెంబర్ 19: మేళ్లచెర్వు మండల కబడ్డీ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ నియామకం రాష్ట్ర కమిటీ చైర్మన్ భూలోకరావు, కన్వీనర్ కర్తయ్య, సభ్యుడు మధు సమక్షంలో గురువారం మండల కేంద్రంలో జరిగింది. అధ్యక్షుడిగా శెట్టి రామచందర్‌రావు, కార్యదర్శిగా మొర్రిమేకల బసవయ్య, కోశాధికారిగా ముడెం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేశ్, ప్రవీణ్‌రెడ్డిని నియమించారు.

మోతె మండల ప్రధాన కార్యదర్శిగా గోపి..

మోతె: కబడ్డీ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శిగా సిరికొండ గ్రామానికి చెందిన జంపాల గోపి ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

'రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయించాలి'

మఠంపల్లి, డిసెంబర్ 19: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ దుకాణదారులను ఆదేశించారు. గురువారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను, లైసెన్స్ పరిశీలించారు. దుకాణదారులు ధరల బోర్డును రైతులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమతి పొందిన ఎరువులు మాత్రమే విక్రయించాలన్నారు. అనంతరం మట్టపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించారు. ఆంధ్ర నుంచి వచ్చే ధాన్యం లారీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

'కేటీఆర్‌పై ఏసీబీ కేసును ఖండిస్తున్నాం'

తుంగతుర్తి, డిసెంబర్ 19: ఫార్ములా ఈ-కార్ రేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ అక్రమ కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసి కాలయాపనతో పబ్బం గడుపుతుందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్, గునిగంటి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి'

మోతె, డిసెంబర్ 19: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ ఆంజనేయులుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మండలాధ్యక్షుడు బొమ్మగాని వెంకటేశ్వర్లు, పరశురాములు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: సీఐటీయూ అనుబంధ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు ధనియాకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు తమ సమస్యలపై ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

అర్వపల్లి, డిసెంబర్ 19: మండలంలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన వేముల లక్ష్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి స్నేహితులంతా కలిసి గురువారం రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా అర్వపల్లికి చెందిన సాయిని శేషు అనే వ్యక్తి మరణించగా, రేఖ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బోయలపల్లి రేఖ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వేల్పుల రమేశ్, మంచాల రామ్మూర్తి, గోవర్ధన్, విష్ణుమూర్తి, నరేశ్, ఉయ్యాల రవి పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

- మహిళకు గాయాలు

కోదాడ రూరల్, డిసెంబర్ 19: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో మహిళ గాయాల పాలైన ఘటన కోదాడ పట్టణ పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై గల టాటా మోటార్స్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని వైజాగ్‌కు చెందిన మదన్ అనే వ్యక్తి తన భార్య జ్యోతి, కుమారుడు, కుమార్తెతో కలిసి కారులో హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే కోదాడ శివారులో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో జ్యోతి కాలుకు గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పల్లె దవాఖానలో మోటార్ చోరీ

నడిగూడెం, డిసెంబర్ 19: మండల కేంద్రంలోని పల్లె దవాఖానలో విద్యుత్ మోటార్ చోరీకి గురైందని డాక్టర్ హరినాథ్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

అనంతగిరి, డిసెంబర్ 19: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అనంతగిరి పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నుంచి ఖమ్మం వైపు ఇసుకతో వెళ్తున్న టిప్పర్‌ను మండలంలోని శాంతినగర్ వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఇసుక తరలించడానికి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్ వేముల వీరన్న, టిప్పర్ యజమాని త్రినేల్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ ట్రక్కు చోరీ

పాలకవీడు, డిసెంబర్ 19: మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో ట్రాక్టర్ ట్రక్కు చోరీకి గురైంది. బాధితుడు కుందూరు బిక్షం తెలిపిన వివరాల ప్రకారం.. బిక్షం తన ట్రాక్టర్ ట్రక్కును మంగళవారం సాయంత్రం గ్రామ పంచాయతీ సమీపంలోని ఖాళీ స్థలంలో నిలిపి ఉంచాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా ట్రక్కు కనిపించలేదు. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు యువకులు మరొక ట్రాక్టర్ ఇంజిన్ సాయంతో ట్రక్కును తీసుకొని వెళ్లినట్లు కనిపించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గురువారం తెలిపాడు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ

హుజూర్‌నగర్, డిసెంబర్ 19: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన జక్కుల సుశాంత్ గౌతమ్ జిలాస్థాయిలో నిర్వహించిన సీఎం కప్ బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్ 19 డబుల్స్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి డబుల్స్, సింగల్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురువారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట రంగారావుతో పాటు పలువురు సుశాంత్‌గౌతమ్‌ను అభినందించారు.

ముగ్గురు వాహనాల దొంగల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 19: వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్‌లోని ఇందిరమ్మ నగర్‌కు చెందిన కొరపాటి నర్సింగ్‌రావు, ఏపీలోని మన్యం జిల్లా పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామానికి చెందిన బాత ప్రసాద్ అనే ఇద్దరి మధ్య పరిచయం ఉంది. ఇద్దరు కలిసి వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నారు. కార్లను అద్దెకు తీసుకొని మార్గం మధ్యలో డ్రైవర్లతో కలిసి మద్యం తాగడం, ఆపై డ్రైవర్లు మత్తులోకి వెళ్లగానే కార్లు దొంగతనం చేస్తుండేవారు. అదేవిధంగా దారి కాచి లిఫ్ట్ అడిగి అదును చూసి వాహనాలను ఎత్తుకెళ్లడం చేసేవారు. ఇలా గత అక్టోబర్ 27న సూర్యాపేటలోని బాలాజీ నగర్‌కు చెందిన మర్రు వెంకటేశ్వర్‌రావు అనే వ్యక్తి విజయవాడలో చదువుతున్న తన కుమార్తెను చూసేందుకని కారులో వెళ్తుండగా ప్రసాద్, నర్సింగ్‌రావు లిఫ్ట్ అడిగారు. దీంతో లిఫ్ట్ ఇచ్చిన వెంకటేశ్వర్‌రావుతో మాటామాట కలిపి విజయవాడకు చేరుకున్నారు. వెంకటేశ్వర్‌రావు తన కుమార్తెకు తినడానికి ఏమైనా తీసుకుందామని ఓ షాపు వద్ద కారు స్టార్టింగ్‌లో ఉంచి పార్క్ చేసి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి కారు కనిపించలేదు. ఇద్దరికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో సూర్యాపేట పట్టణ -2 స్టేషన్‌ను ఆశ్రయించాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఈ నెల 18న సూర్యాపేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నర్సింగ్‌రావు, ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వారి నుంచి 2 కార్లు, 4 బైక్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

హుజూర్‌నగర్‌కు చెందిన గుంజ శ్రీకాంత్ కళాశాలలు, ఆసుపత్రుల వద్ద పార్క్ చేసిన వాహనాల దొంగతనాలకు పాల్పడుతుండగా ఈ నెల 16న సూర్యాపేట పట్టణ -2 పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులకు 18న కొత్తబస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న శ్రీకాంత్‌ను కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించారు. బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి 12 బైక్స్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వివరించారు. సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్

అర్వపల్లి: పోలీసుల అదుపులో మాల మహానాడు నాయకులు

సూర్యాపేట, డిసెంబర్ 19: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మాల మహానాడు నాయకులను జిల్లావ్యాప్తంగా పోలీసులు గురువారం ఎక్కడికక్కడ ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని స్టేషన్లకు తరలించారు. నేరేడుచర్ల, మఠంపల్లి, కోదాడ, తిరుమలగిరి, హుజూర్‌నగర్, నాగారం, పెన్‌పహాడ్ తదితర మండలాల్లో నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

అరెస్ట్ అన్యాయం'

సూర్యాపేట టౌన్: మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్ట్ అప్రజాస్వామికమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర వైస్ చైర్మన్ తలమల్ల హసేన్ అన్నారు. నాయకుల అరెస్ట్ పట్ల గురువారం స్థానిక రైతుబజార్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చందా దాసు, దాసరి దేవయ్య, కంచరదాసు ఆనందరావు, ఇట్టమల్ల బిక్షం, గాజుల నర్సయ్య, అఖిల్, అనంత్ పాల్గొన్నారు.

'అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి'

నేరేడుచర్లలో అమిత్ షా దిష్టిబొమ్మను దహన